క్లుప్తంగా

గణబాబును కలిసిన కాపు సంఘం నేతలు



ఎమ్మెల్యే గణబాబును సత్కరిస్తున్న కాపు సంఘం నేతలు

గోపాలపట్నం: కాపు సంఘం నాయకులు ఎమ్మెల్యే గణబాబును బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఆయన్ను ఘనంగా సత్కరించారు. కొత్తపాలెంలో కాపు సామాజిక భవనం, కాపు సామాజిక వర్గ పిల్లలకు స్కాలర్‌షిప్పులు, నిరుపేదలకు గృహాల మంజూరుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాపు సంఘం అధ్యక్షుడు కంచిపాటి చంటి, సభ్యులు బూర్లె నర్సింగ నాయుడు, నారిపిన్ని సత్తిబాబు, రాళ్లబండి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బోరుబావి ప్రారంభం



బోరుబావి ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పీవీ సురేష్

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు అశోక్‌నగర్ కొండ ప్రాంత ప్రజల నీటి సమస్యకు చెక్ పడింది. ఇక్కడ కొండ ప్రాంతంలో నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.కుళాయిల ద్వారా నీరు సరిపడినంత రాకపోవడంతో స్థానిక మహిళలు దిగువ ప్రాంతంలోని బోరుబావుల వద్దకు వెళ్లి నీరు తీసుకురావాల్సిన పరిస్థితి ఉంది. సమస్యను గుర్తించిన కార్పొరేటర్ సురేష్ అధికారులతో మాట్లాడి బోరుబావిని ఏర్పాటు చేశారు.బోరు బావిని వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ బుధవారం ప్రారంభించారు.దీంతో మహిళలు కార్పొరేటర్ సురేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

గంజాయితో ముగ్గురి అరెస్ట్

గోపాలపట్నం: ఒడిశా ఏజెన్సీ ప్రాంతం నుంచి వస్తున్న ముగ్గురు వ్యక్తుల నుంచి 1.5కిలోల గంజాయి, 3 కిలోల లిక్విడ్ గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు, గోపాలపట్నం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు.. పాడేరు రూరల్ ఒడిశా బోర్డర్ నుంచి కిలోన్నర గంజాయి, 3కిలోల లిక్విడ్ గంజాయిని ఎన్‌ఏడీ కాకానినగర్ కు చెందిన రామ్ ప్రసాద్, విజయనగరానికి చెందిన భరత్ శ్యామ్‌సుందర్, మరో మైనర్ తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో విమాన్‌నగర్ నుంచి యల్లపువాని పాలెం ఎస్సీ కాలనీ రోడ్డులో వల వేసి పట్టుకున్నారు. వారి నుంచి గంజాయి, లిక్విడ్ గంజాయితో పాటు 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు రిమాండ్‌కు పంపించారు.

వామనావతారంలో జగన్నాథస్వామి



వామనావతారంలోని స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

అగనంపూడి : జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడిలో జగన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా బుధవారం సుభద్ర, బలభద్రుని సమేత జగన్నాథస్వామి వామనావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు గురు సంతోష్ ఉత్సవమూర్తులను అలంకరించారు. అగనంపూడి పరసర ప్రాంతాల భక్తులు దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు కరణం పైడిరాజు, గొల్లవిల్లి కనక భవానీ, వెంకటరావు, పండా కుటుంబీకులు పాల్గొన్నారు.
నేడు హేరా పంచమి: రథోత్సవాల ఐదో రోజు ఇంద్రద్యుమ్నహాలు వద్ద లక్ష్మీదేవి అమ్మవారు జగన్నాథస్వామి కోసం ఎదురుచూసే సన్నివేశం, లక్ష్మీదేవి రథాన్ని విరగ్గొట్టి తిరిగి దేవాలయానికి వెళ్లిపోయే సన్నివేశాన్ని రక్తి కట్టించేలా హేరా పంచమి ఉత్సవాన్ని గురువారం సాయంత్రం నిర్వహించనున్నట్టు కరణం పైడిరాజు తెలిపారు.

కొండవాలు.. రక్షణ కరువు

- రక్షణ గోడలు లేక నివాసితుల కలవరం
- కొండచరియలు విరిగిపడతాయని ఆందోళన
- ఇనుప రేకులతో తాత్కాలిక రక్షణ ఏర్పాటు
- శాశ్వత నిర్మాణాలకు వినతులు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డుల పరిధిలోని కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడలు లేకపోవడంతో ఆయా ప్రాంతాల నివాసితులు కలవరపడుతున్నారు. వర్షాకాలం కావడంతో భారీ వర్షాలు పడితే తమ పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నారు.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 59, 60, 61 వార్డుల్లోని కొండవాలు ప్రాంతాల్లో సుమారు 60 వేల మంది వరకు ప్రజలు నివాసం ఉంటున్నారు. ఆయా వార్డుల పరిధిలోని జనతా కాలనీ, ఇందిరా కాలనీ-1,2 ప్రాంతాలు, అశోక్ నగర్, గణపతి నగర్, హిమాచల్ నగర్, వాయుపుత్ర కాలనీ తదితర కొండ ప్రాంతాల్లో గతేడాది కురిసిన భారీ వర్షాలకు రక్షణ గోడలు బీటలు వారడం, కొన్ని చోట్ల కూలిపోవడం జరిగింది. ఇందిరా కాలనీ, హిమాచల్ నగర్ కొండ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు బండరాళ్లు దొర్లి దిగువ గల ఇళ్లపై పడ్డాయి. అయితే అదృష్టవశాత్తు ఆ సమయంలో అక్కడి ఇళ్లల్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. కానీ ఆస్తి నష్టం ఎక్కువ జరిగింది. ఈ ఘటనను దృష్టిలో పెట్టుకుని ఆయా వార్డుల పరిధిలోని కొండవాలు ప్రాంతాల్లో నివాసం ఉంటున్నవారు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాలు ముంచెత్తక ముందే కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడలు నిర్మించాలని కోరుతున్నారు.



ఇందిరాకాలనీ-2 ప్రాంతంలో కూలిన రక్షణ గోడ ప్రాంతంలో వేసిన ఇనుప రేకుల షీట్



ఇందిరాకాలనీ కొండ ప్రాంతంలో రక్షణ గోడ లేకపోవడంతో అడ్డుగా పెట్టుకున్న ఇనుప రేకులు

బిక్కుబిక్కుమంటూ ..



వర్షాకాలం వస్తే ఏ సమయంలో ఏం జరుగుతుందోనని ఆందోళనగా ఉంటోంది. భారీ వర్షాలకు కొండచరియలు విరిగి పడతాయోనని బిక్కుబిక్కుమంటూ ఉంటున్నాం. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించాలి. రక్షణ గోడలు నిర్మించాలి.
– రేవళ్ల సత్యనారాయణ, గణపతినగర్

అధికారులకు వినతులు ఇచ్చినా..



కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడలు నిర్మించి, ఆయా ప్రాంతవాసులకు రక్షణ కల్పించాలని జీవీఎంసీ ఉన్నతాధికారులకు బీజేపీ తరఫున పలు మార్లు వినతులు ఇచ్చాం. అయినా స్పందన లేదు.
– పంచదార్ల అప్పలరాజు యాదవ్, మల్కాపురం

కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు

కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడల నిర్మాణానికి టెండర్లు పిలిచాం. కాంట్రాక్టర్లు కొండ ప్రాంతాలకు వచ్చి నిర్మాణానికి అవసరమైన సామగ్రి, ఇసుక, పిక్క, సిమెంట్ వంటివి తీసుకువెళ్లడం కష్టమని వెనుదిరుగుతున్నారు. అయినా వర్షాలు ఎక్కువ కాకముందే గోడలు నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటాం.
– ఏడుకొండలు, డీఈ (వర్క్స్)

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోపాలపట్నం: కొత్తపాలెం, బుచ్చిరాజుపాలెం సబ్‌స్టేషన్ల పరిధిలో పాతగోపాలపట్నం ఫీడర్‌లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పోలాకి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యల్లపువానిపాలెం, ఎర్రచెరువు, రైల్వే స్టేషన్ మెయిన్ రోడ్డు, నేతాజీ వీధి, విద్యానగర్, బాజీజంక్షన్, సుసర్ల కాలనీ, బుచ్చిరాజుపాలెం, రెడ్డి వీధి, ఎస్సీ కాలనీ, పాతగోపాలపట్నం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.
కంచరపాలెం : జోన్-2 డివిజన్ కంచరపాలెం సెక్షన్ పరిధి సబ్‌స్టేషన్‌లో 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా ఈ నెల 12 శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కాన్వెంట్ జంక్షన్, జ్ఞానాపురం, పైడిమాంబ కాలనీ, ఎఫ్‌సీఐ ఫుడ్ గొడౌన్స్, కోరమాండల్ గేటు తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సర ఫరా ఉండదని, ఆయా ప్రాంతాల ప్రజలు గమనించి సహకరించాలి కోరారు.

జవహర్ నగర్ పరిధిలో...

మల్కాపురం: శ్రీహరిపురం సబ్‌స్టేషన్ పరిధిలోని జవహర్‌నగర్ (రాడర్) 11 కేవీ ఫీడర్‌లో వార్షిక మరమ్మతులు కారణంగా శుక్రవారం ఫీడర్ పరిధిలోని ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జోన్-2 ఈఈ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఇందరాకాలనీ-1,ఇందిరా కాలనీ -2, బర్మాకాలనీ,వీటీ కాలేజ్ రోడ్డు ఏరియా,జనతాకాలనీ,పవన పుత్రకాలనీ,జవహర్‌నగర్ రోడ్డు ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు ఎస్సీబీసీ కాలనీలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేటి తరానికి ఆదర్శ ప్రాయుడని అన్నారు. మన దేశానికి ఆయన మార్గ దర్శకులుగా నిలిచారని కొనియాడారు. ఈ విగ్రహం ఏర్పాటుకు వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆర్థిక సాయం అందించారని తెలిపారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువజన సేవా సంఘం సభ్యులు బెహరా భాస్కరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ, విశ్రాంత జిల్లా జడ్జి నడుపూరు సన్యాసిరావు, అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు, ధనుంజయ్ రావు, కంపర కోటేశ్వర రావు, బల్ల రమణ తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీబీసీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన బెహరా భాస్కరరావు

ఎర్నిమాంబ హుండీ ఆదాయం రూ. 21.3 లక్షలు


కంచరపాలెం : జ్ఞానాపురంలో గల ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో బుధవారం దేవాదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకుల సంయుక్త ఆధ్వర్యంలో అమ్మవారి హుండీలు లెక్కించారు. 50 రోజులకు గాను అమ్మవారి ముడుపులు, ప్రత్యేక దర్శనాల ద్వారా రూ. 21,03,182 వచ్చినట్లు ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. సహాయ కమిషనర్, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బి. వసంతకుమార్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఏపీజీవీ బ్యాంక్, కంచరపాలెం పోలీస్ సిబ్బంది, కమిటీ సభ్యులు, దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీవారి స్వచ్ఛంద సేవకులు తదితరులు పాల్గొన్నారు.



నగదు లెక్కిస్తున్న సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు

జోరుగా వెబ్ ఆప్షన్ల ఎంపిక

మురళీనగర్: ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి నిర్వహిస్తున్న వెబ్ ఆప్షన్ల ప్రక్రియ బుధవారం జోరుగా సాగింది. ఈ నెల 8న వెబ్ ఆధారిత కోర్సులు, కాలేజీల ఎంపిక ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ మొదటి రెండు రోజులు సర్వర్ సహకరించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. మంగళవారం సాయంత్రానికి సర్వర్ పూర్తి స్థాయిలో పనిచేయగా.. బుధవారం ఆప్షన్ల ప్రక్రియ సజావుగా సాగింది. దీంతో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ హెల్ప్‌లైన్ కేంద్రానికి సుమారు వంద మంది విద్యార్థులు తరలివచ్చారు. సిస్టం అడ్మిన్ ఎస్.నాగరాజు పర్యవేక్షణలో ఆన్‌లైన్ సర్టిఫికెట్లను పరిశీలించారు. ఆదాయ ధ్రువ పత్రాలు, ఈడబ్ల్యూస్ సర్టిఫికెట్ల అప్‌లోడ్‌తోపాటు మొబైల్ నంబర్ మార్పు, నాన్ లోకల్ అభ్యర్థులు స్థిర నివాస పత్రాలు అప్‌లోడ్ చేసుకున్నారు. లెక్చరర్ సిహెచ్.అప్పలనాయుడు విద్యార్థులకు సహకరించారు. 12వ తేదీ వరకు ఆప్షన్లు పెట్టుకోవచ్చు. ఈ నెల 13న ఆప్షన్లు మార్చుకోవచ్చు.



కంచరపాలెం పాలిటెక్నిక్ హెల్ప్‌లైన్ కేంద్రంలో ఆప్షన్ల ఎంపికకు వచ్చిన విద్యార్థులు

డివిజన్ పరిధిలో డీఆర్‌ఎం భద్రతా తనిఖీలు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో కేకే లైన్ కొత్తవలస-శివలింగపురం మధ్య బుధవారం డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ భద్రతా తనిఖీలు నిర్వహించారు. శివలింగపురం స్టేషన్‌లో జరుగుతున్న ఆధునీకరణ, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ మార్గంలో జరుగుతున్న ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్ పనులు, ట్రాక్ సర్క్యూట్స్, టన్నెల్స్, పాయింట్స్, క్రాసింగ్స్, బ్రిడ్జిల నిర్వహణ, ట్రాక్షన్ సబ్ స్టేషన్స్, వసతులు, భద్రతా ప్రమాణాలు, రక్షణ గోడలు వంటి ప్రతి పనిని క్షుణ్ణంగా పరిశీలించారు. వర్షా కాలంలో బండరాళ్లు ట్రాక్‌లపై పడేందుకు అవకాశమున్న ప్రాంతాలల్లో తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. అనంతరం స్టేషన్ మాస్టర్, సిబ్బందితో డీఆర్‌ఎం మాట్లాడారు. టన్నెల్స్, ఘాట్ సెక్షన్లలో ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్, సమాచార వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైళ్ల రాకపోకలు సాఫీగా సాగేందుకు అన్ని భద్రతా ప్రమాణాలను పాటించాలని, విధి నిర్వహణలో ఏ మాత్రం ఆదమరచి ఉండరాదని అధికారులకు, సిబ్బందికి సూచించారు. తనిఖీల్లో ఏడీఆర్‌ఎం(ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహూ, వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



శివలింగపురం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

ఈ నెల్లోనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

ఎంవీపీ కాలనీ: డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఈ నెలలోనే విడుదల చేయాలని ఉత్తరాంధ్ర విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు ఇందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు రాజాం ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్‌ను నగరంలోని ఓ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. గత ఐదేళ్లుగా నిరుద్యోగులు డీఎస్సీ నోటిఫికేషన్ కోసం చూస్తున్న ఎదురుచూపులతో పాటు సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. డీఎస్సీకి జనరల్ కేటగిరీ అభ్యర్థుల వయోపరిమితి అర్హతను 48 ఏళ్లకు పెంచాలని విద్యార్థి నాయకుడు సిర్లా శ్యామ్ కోరారు. కొన్నేళ్లుగా నోటిఫికేషన్స్ లేకపోవడంతో అర్హత ఉన్న వేల మంది నిరుద్యోగులు ఉద్యోగాలు పొందలేకపోయారన్నారు. నిరుద్యోగల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కాలనీ వాసులతో కలసి శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ రమణ

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో అభివృద్ధి పనులకు కార్పొరేటర్ బొమ్మిడి రమణ బుధవారం శంకుస్థాపన చేశారు. గతంలో కురిసిన వర్షాలకు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో రిటైనింగ్ వాల్ కూలిపోయింది. దీనిలో భాగంగా రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.12 లక్షల జీవీఎంసీ నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభానికి చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఏఈ వెంకటలక్ష్మి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు నరవ పైడిరాజు, బీజేపీ నాయకుడు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్‌పై ముగిసిన శిక్షణ



శిక్షణ పూర్తి చేసుకున్న వారితో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట: క్యాన్సర్ స్క్రీనింగ్‌పై నెల రోజుల నుంచి జరుగుతున్న శిక్షణ బుధవారంతో ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా త్వరలో చేపట్టనున్న క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం కోసం సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇస్తున్న సంగతి విదితమే. అందులో భాగంగా హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ పర్యవేక్షణలో గత నెల 13వ తేదీ నుంచి శిక్షణ ఇచ్చారు. జిల్లాలో ఉన్న మెడికల్ కాలేజీ వైద్య నిపుణులు (సామాజిక వైద్య శాస్త్ర అధ్యాపకులు, గైనకాలజిస్ట్, డెంటల్ సర్జన్లు, రేడియాలజిస్ట్, సాధారణ సర్జన్లు, రేడియేషన్ అంకాలజిస్టులు, సర్జికల్ అంకాలజిస్టులు) శిక్షణ ఇచ్చారు. జిల్లాలో ఉన్న అన్ని సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో గల గైనకాలజిస్ట్, డెంటల్ సర్జన్లు, జిల్లా టీం వారు శిక్షణ తీసుకున్నారు. జిల్లాలో ఉన్న 91 మంది వైద్యులు, 9 మంది స్టాఫ్‌నర్సులు, 54 మంది సీహెచ్‌వో, 498 మంది ఏఎన్‌ఎంలకు బ్యాచ్‌ల వారీగా రోజుకు 40 మంది చొప్పున ఆంధ్ర వైద్య కళాశాలలో శిక్షణ ఇచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు ఆధ్వర్యంలో జిల్లా ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్ నోడల్ అధికారి డాక్టర్ కె. సాయిసుష్మ, సామాజిక వైద్య విభాగాధిపతి డాక్టర్ ఎ. కృష్ణవేణి, ప్రముఖ అంకాలజిస్టు డాక్టర్ శిల్ప ఆధ్వర్యంలో ఈశిక్షణ కార్యక్రమం జరిగింది.

కార్మిక హక్కులకు కేంద్రం తిలోదకాలు

సీఐటీయూ నాయకుల ఆరోపణ

మల్కాపురం: కార్మికులంటే దేశ ప్రధాని నరేంద్ర మోదీకి చిన్న చూపు అని, అందుకే కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని సీఐటీయూ మల్కాపురం జోన్ నాయకులు కె.పెంటారావు ఆరోపించారు. కార్మిక హక్కులపై మోదీ అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద బుధవారం నిరసన చేపట్టారు. ఆమన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేకత విధానాలు విడనాడాలని డిమాండ్ చేశారు. వారి విధానాల వల్ల లక్షలాది మంది కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.కార్మికులకు మేలు చేయాల్సిన ప్రభుత్వాలు ఇలా అనుసరించడం సరి కాదన్నారు. కార్మికులపై కేంద్రం అనుసరిస్తున్న విధానాలను విడనాడకుంటే తీవ్ర ఉద్యమం తప్పదని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు ఇవ్వకుండా చాప కింద నీరులా కేంద్ర వ్యవహరిస్తుందని ఆరోపించారు.స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టేందుకు కుట్ర జరుగుతుందని ఆవేదన చెందారు.లేబరు కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని,అంగన్‌వాడీ,ఆశ వర్కర్ల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.



హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

రోడ్డుకు అడ్డంగా వాహనాలు

విశాఖ విద్య: ఎన్‌ఏడీ సెంటర్‌లో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. గోపాలపట్నం వైపు వెళ్లే బీఆర్‌టీఎస్ దారిలో అయితే ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫి క్‌సమస్య తీవ్రంగా ఉంటుంది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు అప్రమత్తతతో విధులు నిర్వహిస్తుంటారు. కానీ కొంతమంది వాహనదారుల నిర్వాకంతో ఎన్‌ఏడీ సెంటర్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. బుధవారం ఇలాంటి దృశ్యమే కనిపించింది. యు టర్న్‌కు అవకాశం లేకపోయినా ఓ డీసీఎం వాహనం సర్వీసురోడ్డులోనే మలుపుతిప్పాడు. దీంతో గోపాలపట్నం నుంచి ఎన్‌ఏడీ సెంటర్‌కు వచ్చే సర్వీసు రోడ్‌లో ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్ వద్ద దారి అడ్డంగా నిలిపిపోయింది. దీని వల్ల ఆ దారిలో వచ్చే వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇలాంటి వాహనదారులపై ట్రాఫిక్ పోలీసులు మరింత కఠినంగా వ్యవహరిస్తేనే ట్రాఫిక్ సమస్య తీరుతుందని ప్రయాణికులు అంటున్నారు.



రోడ్డుకి అడ్డంగా వాహనం

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30గంటల నుంచి నిత్యకల్యాణం నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం జరిపారు. సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టింపజేసి అష్టోత్తరంపూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. హరినామస్మరణ మార్మోగింది.

డీఈవో ఆకస్మిక తనిఖీలు

అక్కిరెడ్డిపాలెం: జిల్లా విద్యా శాఖాధికారి ఎల్.చంద్రకళ 68వ వార్డు మిందీ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆమె పలు తరగతులను పరిశీలించారు. విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించిన అనంతరం విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం పి.వి.ఎస్.ఎస్.ఆంజనేయలును డ్రాప్ అవుట్ విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారిని తిరిగి పాఠశాలలో చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్కూల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతను తనిఖీ చేశారు. హెచ్‌ఎంకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు విశ్వనాథం, సునీత, పాల్గొన్నారు.

మహిళా వాకర్స్ సేవలు ప్రశంసనీయం



మాట్లాడుతున్న రిటైర్డ్ న్యాయమూర్తి సుధామణి

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని రిటైర్డ్ న్యాయమూర్తి కె.సుధామణి అన్నారు. మురళీనగర్ బృందావన్ పార్కులో క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక హితం కోసం మహిళలు విశేష కృషి చేస్తున్నారన్నారు. సమాజంలో నేటి మహిళల స్థితిగతులు, వారు ఎదుర్కుంటున్న సమస్యలు, చట్టంలో వీటి పరిష్కారానికి ఉన్న అవకాశాలను వివరించారు. మహిళలు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. వీలునామాకు సంబంధించి చట్టాలను ఆమె తెలిపారు. గృహహింస చట్టంలోని పలు అంశాలను న్యాయవాది పుష్పలత వివరించారు. అనంతరం సుధామణిని మహిళలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి సిహెచ్.లక్ష్మి, కోశాధికారి పి.కమల, ఉపాధ్యక్షురాలు టి.లీలానాయుడు, జాలీ వాకర్ మాధవీలత, పూర్వ అధ్యక్షులు టి.శేషామణి, కె.మాధవి, డి.శిరీష, కార్యవర్గ సభ్యులు రాధ, కృష్ణ వేణి, పుష్ప, జయ, లక్ష్మీకుమారి పాల్గొన్నారు.